

60ల్లోనూ 20లా..

యోగాసనాలు వేస్తున్న సీనియర్ సిటిజన్స్ | నేటికీ క్రమం తప్పని సాధన | ప్రభాత వేళ శిల్పారామం కళకళ

ప్రభాత వేళ .. ప్రశాంత సమయంలో శిల్పారామం సీనియర్ సిటిజన్స్‌తో నిత్యం సందడిగా ఉంటుంది. ఉదయం 6 గంటల నుంచి 60 సంవత్సరాలు నిండిన వారికి ప్రభుత్వం ఉచిత ప్రవేశ సదుపాయం కల్పించడంతో, వందలాది మంది సీనియర్ సిటిజన్స్ సద్వినియోగ పరుచుకుంటున్నారు. వారిలో యోగాభ్యాసం చేసేవారు కొందరైతే, వాకింగ్ చేసేవారు మరికొందరు. 70 సంవత్సరాల వయసులోనూ కంకణాల బాలకృష్ణమాచార్యుల యోగా సాధన చూసేవారిని అబ్బురపరుస్తోంది. సాధారణంగా ఆ వయసులో వారు కూర్చుంటే లేవడమే కష్టం. కానీ, నిరంతర సాధనతో ఆయన యోగాసనాలన్నీ పర్ఫెక్ట్‌గా, సునాయాసంగా వేసేస్తున్నారు. సూర్య నమస్కారాలతో పాటు శీర్షాసనం, ధనురాసనం, చక్రాసనం, హలాసనం, సర్వాంగాసనం వంటి క్లిష్టమైన ఆసనాలనూ అలవోకగా చేస్తున్నారు. అలాగే మీసాల వెంకట కామేశ్వరరావు, బి.మోహనరావు, రామకృష్ణ వంటి మరి కొందరు యోగసాధకులు రోజూ వచ్చి ఇక్కడ సాధన చేస్తుంటారు. వీరంతా ఒక బృందంగా ఏర్పడి, యోగాభ్యాసం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. 'చిన్న ఆరోగ్య సమస్య వచ్చిందంటే ఆస్పత్రులకు భారీగా బిల్లులు చెల్లించాల్సిందే. కానీ నిరంతరం సూర్య నమస్కారాలు, యోగాభ్యాసం చేస్తే రోగాలు దరిచేరవు, అలాగే ఎప్పుడూ చలాకీగా ఉంటాం' అంటూ చెబుతున్నారు ఈ నిరంతర సాధకులు. అలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని క్రమం తప్పకుండా సాధన చేస్తే, ఆరోగ్యకర సమాజం కనుల ముందే సాకారమవుతుంది. – పీఎం పాలెం



క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: హరే కృష్ణ హరే రామ నామస్మరణతో సాగర్‌నగర్‌లోని ఇస్కాన్ మందిరం ఆదివారం మార్మోగింది. వారాంతపు పూజల సందర్భంగా ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని భగవద్గీత శ్లోకాలను ఆలపించారు. ప్రవచనాలు వినిపించారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

140 మంది ఎంపిక



ఎంపికైన ఉద్యోగులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలోని యాక్స్ డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. వివిధ కంపెనీలు పాల్గొన్న ప్రాంగణ ఎంపికల్లో సుమారు 300 మందికి పైగా విద్యార్థులు హాజరు కాగా, 140 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ బి. రాజారావు తెలిపారు.

ఉచితంగా హోమియో మందుల పంపిణీ



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

భీమునిపట్నం: భీమిలిలోని కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ పర్యవేక్షణలో నిర్వహించిన శిబిరంలో డాక్టర్లు టి.జగన్నాధరావు, టి.జె.మోహన్ ఇక్కడికి వచ్చిన 95 మంది రోగులను పరీక్షించి, అవసరమైన మందులను అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కె.ఎస్.ఎన్. మూర్తి, కె.చంద్రశేఖరరావు, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేశారు.. ప్లాట్‌ఫాం మరిచారు



సంతపేట రెడ్డివీధిలో ప్లాట్‌ఫాం తవ్వేసిన బోరుబావి

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సంతపేట రెడ్డివీధిలో బోరుబావి వద్ద ప్లాట్‌ఫాం లేకపోవడంతో మహిళలు నీరు పట్టుకునేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఈ బోరుబావి మరమ్మతులకు గురవడంతో మూడు మాసాల క్రితం సిబ్బంది మరమ్మతులు చేశారు. దీనికోసం ప్లాట్‌ఫారం తొలగించవలసి వచ్చింది. ఆ డెబ్రిస్‌ను బోరుబావి చుట్టూ వేశారు. తరువాత జీవీఎంసీ ప్లాట్‌ఫాం నిర్మించడం మరచిపోవడంతో స్థానిక మహిళలు నీళ్లు పట్టుకోవడం కష్టమవుతోంది. ఇలాగే పలుచోట్ల మరమ్మతుల కోసం ప్లాట్‌ఫారాలు తొలగించారు. వీటికి తిరిగి ప్లాట్‌ఫారాలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

అందుబాటులోకి కళానగర్ పార్కు



పార్కును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మంగమ్మ

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు పరిధి కళానగర్‌లో సువిశాలమైన పార్కును జీవీఎంసీ అందుబాటులోకి తెచ్చింది. ఈ పార్కును కార్పొరేటర్ పిల్లా మంగమ్మ ఆదివారం ప్రారంభించారు. జీవీఎంసీ నిధులు రూ.48 లక్షలతో ఈ పార్కును నిర్మించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పెను తుపాన్లు తట్టుకుని.. చెక్కు చెదరకుండా

భీమిలి పరిసర ప్రాంతాలను సందర్శిస్తే అక్కడ ఐతిహాసిక స్మృతులు.. పురాతన కట్టడాలతో పాటు శతాబ్దాలు దాటిన వృక్షాలు కూడా సందర్శకులను పలకరిస్తాయి.. ఈ ప్రాంతంలో సుమారు 80 నుంచి 120 ఏళ్ల వయసు గల చింత చెట్లు నేటికీ కనిపిస్తాయి. పెను తుపాన్లు ఎన్ని వచ్చినా.. చెక్కు చెదరకుండా అదే ఠీవీతో నిలబడి ఉన్నాయి. సూరీడు నిప్పులు కురిపిస్తున్న వేళ చల్లని నీడనిచ్చి సేదతీరుస్తున్నాయి. ఆర్ అండ్ బీ అందించిన సేవలకు సాక్ష్యాలైన ఇవి.. ఈ ప్రాంతంలో పుట్టి, పెరిగిన వారితో అనుబంధం పెనవేసుకుని ఉన్నాయి.

- ఠీవీగా నిలిచిన చింతచెట్లు
- ఆర్ అండ్ బీ సేవలకు సాక్ష్యాలు



జ్యూట్‌మిల్లు రహదారిలో లేబర్ వెల్ఫేర్ సెంటర్ పక్కన చింతచెట్టు



అదేరోడ్డులో ఫుట్‌బాల్ గ్రౌండ్‌ను ఆనుకుని ఉన్న రెండు చింతచెట్లు



తగరపువలస కూడలిలో చింతచెట్టు

తగరపువలస: పూర్వం రహదారులు, భవనాల శాఖ రహదారులకు ఇరువైపులా మామిడి, చింత, మర్రి తదితర నీడనిచ్చే చెట్లతో పాటు పండ్లు ఇచ్చే చెట్లను నాటింది. నడిచి, వాహనాలపై రాకపోకలు చేసేవారు వేసవిలో వీటి నీడన సేద తీరేవారు. జాతీయ రహదారుల వెంట కూడా ఇలాంటి నీడనిచ్చే చెట్లు తగరపువలస నుంచి విశాఖ, విజయనగరం, పెందుర్తి రహదారులలో ఎక్కువగా ఉండేవి. 2014 అక్టోబర్‌లో హుద్‌హుద్ ధాటికి వీటిలో చాలా వరకు తుడిచిపెట్టుకు పోగా.. జాతీయరహదారుల విస్తరణ సమయంలో వేలాది చెట్లు నేలకొరిగాయి.

ఎందరికో నీడనిచ్చి.. : తగరపువలస కేంద్రంగా ఆర్ అండ్ బీ శాఖ చిట్టివలస ఈఎస్ఐ ఆస్పత్రి, భీమిలి రోడ్డు, రాములమ్మ థియేటర్, చిట్టివలస జ్యూట్‌మిల్లు రోడ్డు, అంబేడ్కర్ కూడలిలో చింత చెట్లు పలువురికి నీడ కల్పించేవి. ద్విచక్రవాహనాలు కూడా అక్కడ పార్క్ చేసేవారు. ప్రస్తుతం జ్యూట్‌మిల్లు రోడ్డులో లేబర్ వెల్ఫేర్ సెంటర్ వద్ద మూడు చెట్లు, అంబేడ్కర్ కూడలిలో ఒక చెట్టు మాత్రం ఆర్ అండ్ బీ సేవలకు సాక్ష్యాలుగా నిలిచి ఉన్నాయి. 80 నుంచి 120 ఏళ్ల వయసు ఉండే ఈ చెట్ల పక్క కొమ్మలు తొలగించినా తట్టుకుని ఈనాటికీ నిలిచి ఉన్నాయి. సంక్రాంతి సమయంలో ఊరూరా బెలూన్లు విక్రయించే వారు సైతం ఈ చెట్ల నీడనే వారం రోజులు తలదాచుకుంటారు.

ఎయిర్‌పోర్టు గండం : భోగాపురం ఎయిర్‌పోర్టు పూర్తయితే దానికి అనుసంధానంగా భీమిలి నుంచి రోడ్డు విస్తరణ జరగనుంది. దీంతో ఈ చెట్లు కనుమరుగవుతాయని స్థానికులు బాధ పడుతున్నారు. ఈ ప్రాంతంలో పుట్టి, పెరిగే వారితో పెరిగిన ఈ చెట్లపై చుట్టుపక్కల గ్రామస్తులు కూడా అనుబంధం పెంచుకున్నారు. అంతేనా.. గతంలో చిట్టివలస కార్మిక వాడలో ఎన్నో కార్మిక కుటుంబాలు ఈ చెట్ల నుంచి చింతకాయలు, చింత చిగురు, చింతపండును తమ ఆహారంలో వస్తువుగా చేసుకున్న రోజులు కూడా ఉన్నాయని గుర్తు చేసుకుంటున్నారు.

జీవీఎంసీ జోన్-2 అధికారుల నంబర్లు

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్-2 పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని జోనల్ కమిషనర్ కొట్యాడ కనకమహాలక్ష్మి తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే ఆయా విభాగాల అధిపతులను నేరుగా ఫోన్‌లో సంప్రదించవచ్చన్నారు. జీవీఎంసీ జోన్-2 మధురవాడ పరిధిలో పలువురు అధికారులు వేర్వేరు ప్రాంతాలకు బదిలీ కాగా వారి స్థానంలో మరి కొందరు ఇటీవల బాధ్యతలు చేపట్టారు. వారి ఫోన్ నంబర్లు..

అధికారి పేరు	హోదా	ఫోన్ నంబర్
కె. కనకమహాలక్ష్మి	జోనల్ కమిషనర్	63038 77027
ఎ. అప్పలరాజు	సూపరింటెండెంట్	99482 96999
తిరుపతిరావు	టౌన్‌ప్లానింగ్ ఏసీపీ	94926 19946
బాలరాజు	టీపీవో	94408 91667
డాక్టర్ కిషోర్	వైద్యాధికారి	88863 38111
శ్రీనివాసరాజు	శానిటరీ సూపర్‌వైజర్	99488 83930
కాకర శ్రీను	శానిటరీ ఇన్‌స్పెక్టర్, 5వ వార్డు	99488 83936
సంతోష్	శానిటరీ ఇన్‌స్పెక్టర్, 7వ వార్డు	99488 83904
మంగరాజు	మలేరియా విభాగం	99488 83906
రామనారాయణ	రెవెన్యూ అధికారి	88972 10764
శాంతిరాజు	ఈఈ	99480 95518
శ్రీరామ్	యూసీడీ ఏపీడీ	77299 99788

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పద్మనాభం: గృహావసరాల లైన్ నుంచి వ్యవసాయ విద్యుత్ లైన్‌ను వేరు చేసే పనులు చేపట్టనున్నందున మండలంలోని మూడు గ్రామాల పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ జగన్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. పాండ్రంగి, మునివానిపాలెం, సామయ్యవలస గ్రామాలకు ఉదయం ఎనిమిది గంటల నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ వాసునాయుడు

తగరపువలస: రౌడీషీటర్లు మితి మీరి ప్రవర్తిస్తే పీడీ యాక్ట్ ఉపయోగించడంతో పాటు నగర బహిష్కారం చేస్తామని ఆనందపురం సీఐ సీహెచ్ వాసునాయుడు హెచ్చరించారు. ఆనందపురం స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ రౌడీ షీటర్లు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, వారిపై ఎవరైనా ఫిర్యాదు చేసినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంటుందని తెలియజేశారు.

కర్మయోగ విశిష్టతను తెలుసుకోవాలి



బంగ్లామెట్టలో త్రైత సిద్ధాంతం గురించి ప్రచారం చేస్తున్న సభ్యులు

తగరపువలస: త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథం అసలైన జ్ఞానం గురించి తెలియజేస్తుందని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి విజయరాంపురం కమిటీ సభ్యులు తెలిపారు. తగరపువలస పరిధిలోని బంగ్లామెట్ట, శ్రీరామ్ నగర్ ప్రాంతాల్లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ కర్మ యోగం విశిష్టత, త్రైత సిద్ధాంత జ్ఞానం గురించి తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విజయరాంపురం కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు, సభ్యులు మంగమ్మ, సంతోష్, లక్ష్మి, కె.రాజు పాల్గొన్నారు.

జ్ఞాపకాల పరిమళం.. స్నేహ సమ్మేళనం



దశాబ్దాల స్నేహ సుగంధం పరిమళించింది. 20 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ ఛాత్రోపాధ్యాయుల ఆటపాటలతో డైట్ ప్రాంగణం కళకళలాడింది. భీమిలిలోని జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్)లో 2004–06 సంవత్సరాల్లో చదువుకున్న సుమారు 50 మంది విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. అందరూ ఎంతో ఆనందంతో, ఉద్వేగానికి గురయ్యారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సరదాగా గడిపారు. నాటి ప్రిన్సిపాల్ మీసాల సూర్యనారాయణను, అప్పటి అధ్యాపకులు పదిమందిని సత్కరించారు. ప్రస్తుత ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. జ్ఞాపకాలను పదిల పరచుకుని, మళ్లీ కలుద్దామంటూ వీడ్కోలు తీసుకున్నారు. – భీమునిపట్నం

మూణ్నాళ్ల ముచ్చటే..

మూడు నెలలకే నేలకొరిగిన జిమ్ పరికరాలు



నేలకొరిగిన జిమ్ పరికరాలు

కొమ్మాది: జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది చెరువు వద్ద ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ అధ్వాన స్థితికి చేరుకుంది. కూటమి ప్రభుత్వం మూడు నెలల క్రితం ఇక్కడ జిమ్ పరికరాలు ఏర్పాటు చేసింది. ప్రజలకు అందుబాటులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశామంటూ అట్టహాసంగా ప్రచారమూ చేశారు. అయితే అదికాస్త మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. ఎవరూ ఉపయోగించకుండానే ఒక్కొక్కటిగా జిమ్ పరికరాలు నేలకొరుగుతున్నాయి. ఈ పరికరాలు పూర్తి స్థాయిలో నాణ్యత లేకపోవడం వలన ఇక్కడికి వచ్చిన వారు జిమ్ చేసుకునేందుకు కాస్త ఆలోచనలో పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ ఓపెన్ జిమ్‌లో అందరికీ ఉపయోగపడేలా నాణ్యమైన పరికరాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వరంబాబుని పరామర్శించిన మజ్జి శ్రీనివాసరావు



ఎర్ర వరహానరసింహంను పరామర్శిస్తున్న మజ్జి శ్రీనివాసరావు

సింహాచలం: ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురై, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 98వ వార్డు పరిధి అడవివరానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎర్ర వరహానరసింహం(వరంబాబు)ను ఆ పార్టీ భీమిలి నియోజకర్గం ఇన్‌చార్జి మజ్జి శ్రీనివాసరావు ఆదివారం పరామర్శించారు. నగరంలోని ఆరాధ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వరంబాబును కలిసి ధైర్యం చెప్పారు. పార్టీ అండగా ఉంటుందని, త్వరగా కోలుకుని మళ్లీ పార్టీకి సేవలందించాలని ఆకాంక్షించారు. ఆయన కుటుంబ సభ్యులను పలకరించి, ధైర్యం చెప్పారు. మజ్జి శ్రీనివాసరావు వెంట పార్టీ ఆనందపురం మండల అధ్యక్షుడు బంక సత్యం, నాయకులు మజ్జి వెంకటరావు, దాము ఉన్నారు.

హెచ్చరిక బోర్డు అలంకారప్రాయమే..



నో పార్కింగ్ బోర్డు ఉన్న చోటే పార్క్ చేసిన వాహనాలు

మధురవాడ: అనధికార పార్కింగ్ నిరోధించి, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకోసం ట్రాఫిక్ పోలీసుల ఏర్పాటు చేసిన నోపార్కింగ్ బోర్డులు పీఎం పాలెం ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో పలు చోట్ల అలంకారప్రాయంగా మారాయి. తరచూ ట్రాఫిక్ సమస్యలు వస్తున్న నేపథ్యంలో పత్రికల్లో వచ్చిన పలు కథనాలతో పోలీసులు కార్‌షెడ్, మిథిలాపురి వుడా కాలనీ మాస్టర్ ప్లాన్ రోడ్డు, మధురవాడ అప్ బ్రిడ్జి, డైలీ మార్కెట్, జీవీఎంసీ ఆఫీస్, రైతుబజార్, కొమ్మాది జంక్షన్ తదితర ప్రాంతాలలో నోపార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేశారు. అయినా ప్రయోజనం లేకపోతోంది. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మురుగు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



మురుగును తొలగిస్తున్న సిబ్బంది

తగరపువలస: జీవీఎంసీ 2వ వార్డు సంగివలస, ఉప్పాడపేట, ఇడదాసరిపేట, నమ్మివానిపేట, పోరాడపేట ప్రాంతాల్లో వ్యర్థాలను శానిటరీ సిబ్బంది తొలగించారు. ఈ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పూర్తిస్థాయిలో లోపించడంతో 'ఏ వీధి చూసినా..' శీర్షికతో సాక్షి దినపత్రికలో శనివారం ప్రచురించిన కథనానికి శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహాలక్ష్మి నాయుడు స్పందించారు. ఆదివారం సిబ్బందితో పై ప్రాంతాల్లో కాల్వల్లో పేరుకుని పోయిన వ్యర్థాలను పూర్తిస్థాయిలో తొలగించారు. అదేవిధంగా రాత్రి సమయాల్లో రోడ్లపై సంచరిస్తున్న పశువులను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వైభవంగా శ్రీలప్రభుపాదుల విజయోత్సవం



శ్రీలప్రభుపాదుల విగ్రహానికి అభిషేకం

తగరపువలస: ఇస్కాన్ బెంగళూరు భక్తుల 25 ఏళ్ల న్యాయ పోరాటానికి సుప్రీంకోర్టు తీర్పుతో విజయం లభించిన సందర్భంగా ఆదివారం ఉదయం గంభీరం ఐఐఎంవీ రోడ్డులో గల చైతన్య భవన్‌లో విజయోత్సవం జరుపుకొన్నారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ విశాఖ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస ఆధ్వర్యంలో శ్రీల ప్రభుపాదుల వారి విగ్రహానికి అభిషేకం, హారతి, కీర్తనలు నిర్వహించారు. గ్లోబల్ హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు మధు పండిత్ దాస ఆన్‌లైన్‌లో ప్రసంగించారు.

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

పీఎం పాలెం: జాతర వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం శిల్పారామం ఎదురుగా దాహార్తుల కోసం వేసవి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రయంలో భాగంగా మజ్జిగ పంపిణీ చేసారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు రామ్ ప్రసాద్, బండారు కుమార్, త్రినాథ్ కన్నారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.